నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
3 | నిజామాబాద్, శనివారం 9 మార్చి 2024 | KAMAREDDY


కామారెడ్డిలోని శివాలయంలో భక్తుల సందడి

# హరహర మహాదేవ..

## శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు


ఉమ్మెడలోని ఉమామహేశ్వర ఆలయ ఆవరణలో దీపాల స్తంభం వద్ద భక్తుల రద్దీ


దుర్కి సోమలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి దంపతులు


నిజామాబాద్ నీలకంఠేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు


నీలకంఠేశ్వరాలయంలో బోనం సమర్పిస్తున్న నానియాదవ్

### మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు,అభిషేకాలు
### ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు



నందికో మాట..

**మహాశివరాత్రి పర్వదినం** పురస్కరించుకొని శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారు జాము నుంచే మొదలైన ప్రత్యేక పూజలు అర్ధ రాత్రి లింగోద్భవ కాలం వరకు కొనసాగాయి. పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు లైన్లలో భక్తులు బారులుతీరి కనిపించారు. ఆలయాల్లో బిల్వపత్రాలతో పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా శివపార్వతుల కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిపించారు. భక్తుల జాగరణ దృష్ట్యా ఆలయాలను సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీలు, అధికారులు ఏర్పాట్లు చేశారు.


నందిగుట్టలో.. | నిజామాబాద్ నగరంలోని శంభుని గుడి వద్ద భక్తుల క్యూ..


మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు

# పండుగ పూట విషాదం

జిల్లాలో శివరాత్రి పర్వదినం రోజున తీవ్ర విషాదం నెలకొన్నది. శుక్రవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాతపడ్డారు. ఎస్సారెస్పీ లక్ష్మీకాలువలో నీట మునిగి ముగ్గురు యువకులు మృతిచెందగా.. రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు దుర్మరణం చెందారు. ఈ రెండు ఘటనలు మెండోరా, వేల్పూర్ మండలాల్లో చోటుచేసుకున్నాయి.

**వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి**

- ఎస్సారెస్పీలో నీట మునిగి ముగ్గురు యువకులు..
- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల దుర్మరణం
- నాలుగు కుటుంబాల్లో అంతులేని విషాదం
- మెండోరా, వేల్పూర్ మండలాల్లో ఘటన


లోకేశ్ (ఫైల్)


మున్నా (ఫైల్)


సాయినాథ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో తండ్రికొడుకుల మృతి
నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలో ఘటన

## దవాఖానకు వెళ్తూ అనంతలోకాలకు..

వేల్పూర్/మోర్తాడ్, మార్చి 8 : డయాలసిస్ చేయించుకోవడానికి దవాఖానకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందారు. ఈ ఘటన వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ శివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్నది. మోర్తాడ్ మండలం దొన్కల్ గ్రామానికి చెందిన మాడవేడి రవీందర్(55)కు రెండు కిడ్నీలు చెడిపోయాయి. దీంతో వారంలో మూడు రోజులు జిల్లా ప్రభుత్వ దవాఖానకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన కొడుకు మాడవేడి శివరాజ్(24)తో కలిసి శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి బైక్‌పై బయల్దేరారు. మార్గమధ్యంలో వేల్పూర్ మండలం అంక్సాపూర్ శివారులో ఆగి ఉన్న లారీని వీరి బైక్ ఢీకొట్టింది. దీంతో తండ్రీకొడుకులిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, వేల్పూర్ ఎస్సై వినయ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

**ఉదయం వెళ్తే త్వరగా ఇంటికి రావొచ్చని..**

ఉదయం పూట వెళ్తే డయాలసిస్ చేయించుకొని ఇంటికి త్వరగా రావొచ్చని భావించి తండ్రీకొడుకులు తెల్లవారుజామున బయల్దేరారు. కొన్ని రోజుల నుంచి రవీందర్‌కు వచ్చిన జబ్బును నయం చేసుకోవడానికి కుటుంబ సభ్యులు దవాఖానల చుట్టూ తిరుగుతున్నారు. ఇంటి నుంచి బయల్దేరిన వారు వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ శివారుకు రాగానే


మృతి చెందిన శివరాజ్, రవీందర్(ఫైల్)

రోడ్డుపై ఆగి ఉన్న లారీకి బైక్ ఢీకొట్టడంతో వీరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

**గ్రామంలో విషాదఛాయలు**

మాడవేడి రవీందర్ గల్ఫ్‌లో కొంతకాలం కార్మికుడిగా పనిచేసి స్వగ్రామానికి వచ్చాడు. ఇక్కడ చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రవీందర్ భార్య బీడీలు చుడుతూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నది. వీరికి ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కొడుకు శివరాజు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగవేటలో ఉండగా.. చిన్న కొడుకు ఇంటర్ చదువుతున్నాడు. కొన్నిరోజులుగా రవి ఆరోగ్యం క్షీణించడంతో వారానికి ఒకసారి డయాలసిస్ చేయించుకోవాల్సి రావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. శివరాత్రి పూట తండ్రీకొడుకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎస్సారెస్పీలో నీట మునిగి..

## ముగ్గురు యువకుల మృతి

**మెండోరా మండలంలో ఘటన**

ముప్కాల్/జక్రాన్‌పల్లి, మార్చి 8: ఎస్సారెస్పీ సందర్శనకు వెళ్లిన ముగ్గురు యువకులు లక్ష్మి కాలువలో నీట మునిగి మృతిచెందారు. మృతి చెందిన యువకులు జక్రాన్‌పల్లి మండలం గన్యా తండాకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటన ముప్కాల్ పరిధిలోని లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద శుక్రవారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు.. జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాకు చెందిన సలావత్ వంశీ, అజ్మీర్ సందీప్, భూక్యా భాస్కర్, లోకేశ్ (17), సాయినాథ్ (16), మున్నా (17) మొత్తం ఆరుగురు స్నేహితులు కారులో శుక్రవారం సెలవుదినం కావడంతో ఉదయం ఎస్సీరెస్పీ సందర్శనకు వెళ్లారు. ప్రాజెక్టు లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద స్నానం చేసేందుకు కాలువలోకి దిగారు. ఇందులో ముగ్గురు బయటికి రాగా.. మిగతా ముగ్గురు లోకేశ్, సాయినాథ్, మున్నా లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో గల్లంతయ్యారు. దీంతో బయటికి వచ్చిన మిగతా ముగ్గురు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న ముప్కాల్ పోలీసులు.. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డితోపాటు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ముప్కాల్, బాల్కొండ ఎస్సైలు భాస్కరాచారి, గోపి పాల్గొనగా.. సాయంత్రం ముగ్గురు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి తెలిపారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**గ్రామంలో విషాదఛాయలు**

మృతిచెందిన వారిలో సాయినాథ్, మున్నా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాస్తున్నారు. లోకేశ్ హైదరాబాద్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ముగ్గురు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


ప్రాజెక్టులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

## నాణ్యమైన విద్యను అందిస్తాం


రెంజల్‌లో మైనార్టీ కళాశాల, పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్, మార్చి 8: ఒకటో తరగతి నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్య, అందుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ. 18కోట్లతో నిర్మించిన మైనార్టీ ఉర్దూ కళాశాల, పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు విద్య ఎంతో దోహదపడుతుందని అన్నారు. అంత కుముందు తహసీల్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్‌హందాన్, ఆర్డీవో రాజాగౌడ్, జడ్పీటీసీ విజయ పాల్గొన్నారు.

## మెట్లబావిని సందర్శించిన పురావస్తు పరిశోధకులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 8: ఎల్లారెడ్డి పట్టణం కోదండరామాలయంలోని మెట్ల బావి, నీలకంఠేశ్వరాలయంలోని నందీశ్వర విగ్రహాలను పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివ నాగిరెడ్డి బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఎండీ కల్పనా రమేశ్ మెట్ల బావి పునరుద్ధరణ పనుల వివరాలను వారికి వివరించారు. సంప్రదాయ సున్నపురాయితో శిథిలమైన భాగాల్ని అనుభవజ్ఞులైన శిల్పులతో చేపడతామని, వానకాలంలోపు పనులు పూర్తవుతాయని తెలిపారు.


మెట్లబావివివ రాలనుతె లుసుకుంటున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

**బావి చరిత్ర తెలుసుకున్న ఎమ్మెల్యే**

నాలుగు వందల ఏండ్ల చరిత్ర గల మెట్లబావిని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా పునరుద్ధరణ పనులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఆలయ ధర్మకర్త సిద్ధి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## అడవికి నిప్పు

డిచ్‌పల్లి, మార్చి 8: ఇందల్వాయి మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారి వన నర్సరీకి ఎదురుగా ఉన్న అడవికి గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పు పెట్టారు. దీంతో రెండు కిలోమీటర్ల మేర అడవి అగ్నికి ఆహుతైంది. పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. రోడ్డు పక్కన ఉన్న చెట్లు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి

